ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 4 జూన్ 2025



ప్రైవేట్ సర్వేయర్లకు సజావుగా శిక్షణ అందించాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

రామగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సర్వేయర్లకు సజావుగా శిక్షణ అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం జేఎన్టీయూ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రైవేట్ సర్వేయర్ల శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూభారతి చట్టం ప్రకారం భూక్రయ, విక్రయాలకు, మ్యూటేషన్ కోసం తప్పనిసరిగా భూమి మ్యాప్ జత చేయాల్సి ఉంటుందని, ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించి భూ సర్వే నిర్వహించే మ్యాప్ తయారు చేసేందుకు ప్రైవేట్ సర్వేలకు ప్రభుత్వం అనుమతి అందిస్తూ లైసెన్స్ విధానాన్ని ప్రవేశపెడుతుందన్నారు. అందులో భాగంగా ముందస్తుగా 6000లకు పైగా ప్రైవేట్ సర్వేయర్లకు లైసెన్స్ జారీ చేసేందుకు ప్రభుత్వం శిక్షణ అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రెండు బ్యాచ్‌లలో 112 మంది ప్రైవేట్ సర్వేయర్లకు భూ భారతి చట్టం, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సర్వే పద్ధతులపై జూలై 26 వరకు రెండు నెలల పాటు శిక్షణ అందిస్తామని, శిక్షణ అనంతరం ప్రైవేట్ సర్వేయర్లకు ప్రభుత్వం లైసెన్స్ జారీ చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల సర్వే నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టం పకడ్బందీగా అమలు చేసేందుకు సర్వేయర్ల అవసరం ఉంటుందన్నారు. శిక్షణ సజావుగా సంపూర్ణంగా అందేలా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, డిప్యూటీ ఐఓఎస్ గణపతి, రఘుపతి, అనిల్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన
విత్తనాల సరఫరా
● ఎమ్మెల్యే విజయరమణారావు

8

పారిశుధ్య కార్మికుల
సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ
● అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ఫలించిన పోరాటం

- అంగన్‌వాడీల పదవీ విరమణ ప్రయోజనాల పెంపు
- టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష
- 65 ఏళ్లు నిండితే పదవీ విరమణ
- అమలు విషయమై జీవోలో స్పష్టత కరువు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పదవీ విరమణ అనంతరం తమకు ఇచ్చే ప్రయోజనాలను పెంచాలని కొంత కాలంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న పోరాటం ఫలించింది. యేటా ఏప్రిల్ 30వ తేదీ నాటికి 65 ఏళ్ల నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పదవీ విరమణ ఉంటుం దని, ఇప్పటి వరకు టీచర్లకు ఇస్తున్న లక్ష రూపాయలను 2 లక్షలకు, ఆయాలకు ఇస్తున్న 50 వేలు లక్ష రూపాయలకు పెంచు తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇది ఎప్పటి నుంచి వర్తించనున్నదనే విషయమై ప్రభుత్వం జారీ చేసిన జీవో 8లో స్పష్టం చేయకపోవడంతో పదవీ విరమణ పొందిన టీచర్లు, ఆయాలు ఆందోళన చెందుతున్నారు.

● అంగన్‌వాడీ కేంద్రాల్లో 300 వరకు పోస్టులు ఖాళీ

రెండేళ్లలో దాదాపు 300 మందికి పైగా టీచర్లు, ఆయాలు పదవీ విరమణ పొందారు. జిల్లాలో 706 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 2024 ఏప్రిల్ 30 నాటికి 68 టీచర్ పోస్టులు, 227 హెల్పర్ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి మరిన్ని టీచర్, ఆయా పోస్టులు ఖాళీ అయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ లేదు. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేస్తే తప్ప పోస్టులు ఖాళీ ఏర్పడేవి కావు. ఈ కేంద్రాల్లో 5 ఏళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిం చడంతోపాటు విద్యాబుద్ధులు నేర్పించాల్సి ఉంటుంది. బాలింతలు, గర్భిణీలకు సైతం పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఇవేగాకుండా ఇతరత్రా విధులను అంగన్‌వాడీ టీచర్లకు అప్పగిస్తారు. వీరి పదవీ విరమణకు సంబంధించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పదవీ విర మణ వయస్సును నిర్ధారించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 60 ఏళ్లు, కర్ణాట కలో 58 ఏళ్లు, తమిళనాడులో 60 ఏళ్ల నిండిన తర్వాత పదవీ విరమణను అమలు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కూడా 65 ఏళ్లకు పదవీ విరమణ చేయాలని 2023 సెప్టెంబర్ 5వ తేదీన బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 10 జారీ చేసింది. అప్పటి వరకు పదవీ విరమణ అనంతరం టీచర్లకు 60 వేలు, హెల్పర్లకు 30 వేల రూపాయల బెనిఫిట్స్ కింద ఇచ్చేవాళ్లు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం టీచర్లకు లక్ష, హెల్పర్లకు 50 పెంచుతూ జీవోలో పేర్కొంది.

● పదవీ విరమణ ప్రయోజనాలు పెంచాలని పోరాటం..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పదవీ విరమణ వయసు, కటాఫ్ నెలను ఖరారు చేసిన తర్వాత పదవీ విరమణ అనంతరం ఇచ్చే ప్రయోజనాలను రెండింతలు పెంచాలని పోరాటం చేశారు. జీవో 10 వెలువడిన అనంతరం ఇతర సమస్యలతో పాటు టీచర్లకు 2 లక్షలు, హెల్పర్లకు ఒక రూపాయల బెనిఫిట్స్ ఇవ్వాలని 24 రోజుల పాటు రాష్ట్ర

(మిగతా 8వ పేజీలో)

చివరి గింజ వరకు మద్దతు ధరకు కొనుగోలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ గింజను మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. ఆర్కే గార్డెన్లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షంతో తడిసి, రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 329 కొనుగోలు కేంద్రాలలో ప్రారంభించగా ఇప్పటి వరకు 328 కేంద్రాల్లో పూర్తి చేశామని వివరించారు. మొత్తం 3లక్షల 96 వేల 805 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇందులో దొడ్డురకం 3 లక్షల 97 వేల 17 మెట్రిక్ టన్నులు, సన్నరకం వడ్లు 77 లక్షల 88 .మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 58వేల 603 మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 93 శాతం చెల్లింపులు జరిగాయని, జిల్లా వ్యాప్తంగా సన్న రకం వడ్లకు బోనస్ 38 కోట్ల 54 లక్షల రూపాయలు త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 2కోట్ల 16వేల 912 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా దొడ్డురకం కోటి 54 లక్షల 654 మెట్రిక్ టన్నులు, సన్నరకం 62 వేల 323 మెట్రిక్ టన్నులు సేకరించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. 31 వేల 619 మంది రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. నియోజకవర్గంలో సన్న రకం వడ్లకు బోనస్ 31 కోట్ల రూపాయలు త్వరలో జమ చేస్తామని, తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులను కటింగ్ పేరుతో నట్టేట ముంచారన్నారు. ధాన్యం కొనుగోళ్లపై బీఆర్‌ఎస్, బీజేపీలు అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నారని, ఢిల్లీలో రైతులు హక్కుల కోసం పోరాడుతుంటే కాల్పులు జరిపించారని, బీఆర్‌ఎస్ హయాంలో ఖమ్మంలో రైతులకు బేడీలు వేసి జైలుకు పంపారన్నారు. రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాష్‌రావు, సింగిల్ విండో చైర్మన్లు ఆళ్ల సుమన్ రెడ్డి, చింతపండు సంపత్, రాంచంద్రరెడ్డి, కుర్రమల్ల రెడ్డి, నూగిల్లా మల్లన్న, భూత గడ్డ సంపత్, సయ్యద్ మస్రుత్, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ధనాయక్ దామోదర్ రావు, అరె సంతోష్, సమా రాజేశ్వర్ రెడ్డి చిలుక సతీష్, బొజ్జ శ్రీనివాస్, బొంకురి అవినాష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, జడల సురేందర్, జగదీష్, అస్లాం, తూముల సుభాష్, తిరుపతి రావు, నాంసాని శ్రీనివాస్, వెంకటేష్, మహేష్, రెడ్డి రజినీకాంత్, కర్ణాకర్, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

చందపల్లిలో సమగ్ర ఆరోగ్య శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అన్నాప్రసన్నకుమారి

పెద్దపల్లిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చందపల్లి బస్తీ దవాఖానాలో సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి అన్నా ప్రసన్నకుమారి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య శిబిరాలు రోజుకు ఒక గ్రామం లేదా అర్బన్ వార్డులో వంద రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమగ్ర ఆరోగ్య శిబిరంలో 83 మందికి డయాబెటిస్, బీపీ, హిమోగ్లోబిన్, ర్యాండమ్ బ్లడ్ శాంపిల్ పరీక్షలు, క్షయ నిర్ధారణకు పరీక్షలు, ఎక్స్‌రే నిర్వహించామన్నారు. వీటితోపాటు పురుషులు, స్త్రీలకు సోకే జ్ఞానేంద్రియాల అంటువ్యాధులపై పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తెలిపామన్నారు. డాక్టర్ సుధాకర్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ స్వరూప కిరణ్, వైద్యాధికారి శంకర్, ఐసిటిసి కౌన్సిలర్, ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



భోజన్నపేట సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లుఅదనపు కలెక్టర్ వేణు అన్నారు. రంగాపూర్, భోజన్నపేట గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భోజన్నపేటలో నిర్వహిస్తున్న సదస్సుకు అద నపు కలెక్టర్, ఆర్డీవో గంగయ్య సందర్శించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన ఆధారాలతో కూడిన పత్రాలతో దరఖాస్తులు సమర్పిస్తే అవసరమైన చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అవకాశాన్ని రైతులు, ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్ రాజయ్య, డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, ఆర్ఐలు భాను, వెంకట రాజిరెడ్డితో పాటు అధికారుల బృందం పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్

కోల్‌సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్టు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి జూలై 1వ తేది వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు, నిర్వహించకూడదని, ఏమైన కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ముందస్తు పోలీస్ అనుమతి తీసుకోవాలన్నారు. బంద్‌ల పేరిట బలవంతంగా వివిధ సంస్థలను, కార్యాలయాలను మూసి వేయాలని బెదిరించినా, ఒత్తిడి చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజేలు, డ్రోన్‌లపై నిషేదం పొడిగించినట్టు కమిషనర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. డీజేల స్థానంలో మైక్‌సెట్లకు అనుమతులు ఇస్తామని, ఏసీపీల నుంచి అనుమతి పొందాలన్నారు.

డీఈవో అవినీతిపై విచారణ చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పెద్దపల్లిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారి అవినీతిపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. విద్యాధికారిని సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థి యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు అమరగాని ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ డీఈవో మాధవి అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు చేసినా కలెక్టర్ స్పందించలేదన్నారు. టీచర్ ట్రైనింగ్ క్యాంపుల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించారన్నారు. సమగ్ర శిక్ష నిధుల వినియోగంలో జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఉన్న డీఈవో అవకతవకలకు పాల్పడ్డారన్నారు. కంప్యూటర్ల కొనుగోళ్లలో, ప్రభుత్వ నిధుల వినియోగంలో ఆర్థిక అక్రమాలపై అధికారులు సంవత్సరం క్రితమే డీఈవోకు వ్యతిరేకంగా నివేదిక ఇచ్చారని, ఆ నివేదికపై చర్యలెందుకు చేపట్టలేదో చెప్పాలన్నారు. ఇన్‌స్పైయిర్ అవార్డుల నిర్వహణకు ప్రభుత్వం నుంచి మంజూరైన లక్షలాది రూపాయల నిధులను డీఈవో మాధవి ప్రైవేట్ స్కూళ్ల నుంచి వసూలు చేసిన డబ్బుతో కార్యక్రమం చేపట్టారని ఆరోపించారు. కార్యాలయంలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని వసూళ్ల కోసం ఏజెంట్‌గా నియమించి, అన్ని లావాదేవీలను అతని ద్వారా నిర్వహిస్తున్నారని, అతని ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలిస్తే అవినీతి బయటపడుతుందని పేర్కొన్నారు. విఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సిలివేరు మధు, గూడెపు జనార్దన్ రెడ్డి, రాజాం మహంత క్రిష్ణ, రామగిరి మహేందర్, జంగా కిరణ్ రెడ్డి, పంజాల రవీందర్ గౌడ్, వెంకటేశ్వర్లు, కొమ్మ ఐలయ్య, పెద్దోల్లా ఐలయ్య, దాడి రవీందర్, ఆలుబోజు రాజేందర్, దొడ్ల రాజయ్య, అశోక్ గౌడ్, మేరుగు కనకయ్య, కంచి శ్రీనివాస్, ఎల్లేష్ గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా భూసేకరణ చేపట్టాలి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ పరిధిలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. మంథని ప్రాంతంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూములను క్షేత్రస్థాయిలో కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంగుళూరు శివారులో శ్రీపాద మార్గ్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి అనువైన భూములు, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అనువైన 70 ఎకరాల భూమిని సర్వే చేయాలని ఆదేశించారు. శ్రీపాద మార్గ్‌కు ఆర్‌అండ్‌బీ అధికారులు మార్కింగ్ చేసిన ప్రకారం రెవెన్యూ అధికారులు సర్వే చేయాలన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసేందుకు 10ఏ మినహాయింపు సాధించాలన్నారు. అంగుళూరు శివారులో 70 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సర్వే ప్రారంభించాలని, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

రామగుండంలో పెరిగిన డివిజన్లు

- నాలుగు గ్రామాల విలీన ప్రక్రియ పూర్తి
- 50 నుంచి 60 డివిజన్లకు చేరిక
- పునర్విభజనకు కసరత్తు...
- ఒక్కో డివిజన్‌కు 2,800 నుంచి 3100ఓటర్లు...
- నేడు గెజిట్ నోటిఫికేషన్



కోల్‌సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో డివిజన్ల సంఖ్య 50 నుంచి 60కి పెరిగింది. అంతర్గాం మండలం లింగాపూర్, కుందనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అక్బర్‌నగర్, రామగిరి మండలం వెంకట్రావ్‌పల్లె, పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గేట్ గ్రామపంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. దీంతో కార్పొరేషన్ విస్తీర్ణం 93.87 చదరపు కిలోమీటర్ల నుంచి 99.5చదరపు కిలోమీటర్లకు పెరిగింది. ఓటర్ల సంఖ్య 1.78లక్షలుగా ఉంది. డివిజన్ల పునర్విభజనకు ప్రభుత్వం జీవోఆర్‌టీ నెం.269 జారీ చేసింది. 1,78,000ఓటర్లను 60 డివిజన్లుగా విభజిస్తున్నారు. ఒక్కో డివిజన్‌కు 2,800 నుంచి 3100ఓటర్లు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు కసరత్తు పూర్తయ్యింది. మార్కండేయకాలనీ, కేసీఆర్‌కాలనీ, శారదానగర్ తదితర అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్య పెరగడంతో 25, 26డివిజన్లుగా ఉన్న ఈ ప్రాంతాల్లో అదనంగా మరో డివిజన్‌గా విభజిస్తున్నారు. ఎన్‌టీపీసీ టౌన్‌షిప్‌లో ఓటర్ల సంఖ్య తగ్గుతుండడంతో అదనంగా కాజిపల్లిని చేరుస్తున్నారు. రామగుండం, యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతాల్లో డివిజన్లు పెరుగుతున్నాయి. ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, భౌగోళికంగా దూరంగా ఉన్న ప్రాంతాలను పక్కనే ఉన్న డివిజన్లలో కలిపేందుకు కసరత్తు చేస్తున్నారు. బుధవారం డివిజన్ల పునర్విభజనకు సంబంధించి గెజిట్ విడుదల కానున్నది. జూన్ 5 నుంచి 11వరకు ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి సలహాలు స్వీకరిస్తారు. 12 నుంచి 16 వరకు అభ్యర్థనలు, ఫిర్యాదులను పరిష్కరిస్తారు. జూన్ 17,18 తేదీల్లో కలెక్టర్ తుది జాబితాను ప్రచురించి మున్సిపల్ డైరెక్టర్‌కు నివేదిస్తారు.

● ఆశావాహుల్లో అయోమయం...

డివిజన్ల పునర్విభజనతో ఆశావాహుల్లో అయోమయం నెలకొన్నది. ఇప్పటి వరకు మాజీ కార్పొరేటర్లు, నాయకులు తమ ప్రాంత డివిజన్లు తామే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఏ బ్లాక్ ఎటు పోతుందో, ఏ ఇండ్లు ఏ డివిజన్లకు మారుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పని చేయాలి

- రహదారుల విస్తరణలో రాజీ పడేది లేదు
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాల్‌లో అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ జె. అరుణశ్రీతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణంలో కోట్లాది రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. అధికారుల పనితీరుతోనే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పారిశుధ్య కార్మికుల సేవలతో ప్రజా ఆరోగ్యం, నగర సౌందర్యం ముడిపడి ఉన్నందున ఈ విషయంలో పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు, వాహనాలు అందుబాటులో ఉన్నాయని, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన రోడ్డు వెడెల్పు, విస్తరణ పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మక్కాన్‌సింగ్ స్పష్టం చేశారు. కోనో కార్పస్ మొక్కలను తొలగించి బోగన్‌విల్లా, పాంట్రీ తదితర జాతుల మొక్కలను నాటాలన్నారు. వనమహోత్సవంలో పెద్ద సంఖ్యలో మొక్కలను నాటాలని సూచించారు. శాలపల్లి రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎన్టీపీసీ సహకారాన్ని అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని రామగుండం తహసీల్దార్‌కు సూచించారు. రాజీవ్ రహదారిపైకి వాహనాలు వచ్చే సమయంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బి, హెచ్‌కెఆర్ అధికారులను ఆదేశించారు. లారీలు రోడ్డుపై నిలపకుండా ఆటోనగర్‌లోనే పార్కు చేసేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజీవ్ రహదారిలో రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులకు, వర్షాకాలంలో శాంతినగర్ ముంపునకు గురి కాకుండా నాలాను అభివృద్ధి చేయాలని ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులకు సూచించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అంశాలను ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ వివరించారు. ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులు, సిబ్బందికి పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. ఏసీపీలు ఎం.రమేష్, సిహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ కమీషనర్ సాయిని వెంకటస్వామి, ఎస్ఇ శివానంద్, ఈఈ రామన్, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎన్టీపీసీ అధికారులు మయాంక్, బాలసుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ, ప్రవీణ్ చౌదరి, అధికారులు వసంత్, సునీత, ధనుంజయ్, డిఈ ప్రభాకర్, ఎడిఈలు వెంకటేశ్వర్లు, రమేష్, డిఎఫ్‌వో సాంబయ్య, ఆర్‌వోఎం నాయక్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అసంతృప్తి

● రాత్రి వేళల్లోనూ డివిజన్లలో ఎమ్మెల్యే పర్యటన

కోల్‌సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలు అభివృద్ధిలో కీలకమని పేర్కొంటున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ వీటి ప్రక్షాళనకు ఉపక్రమించారు. మంగళవారం కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రామగుండంలో మున్సిపల్‌లో 525మంది, సింగరేణిలో 500, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌లో అదనంగా మరో 300మంది పారిశుధ్యంలోనే పని చేస్తున్నారని, అయినా పారిశుధ్యం మెరుగుపడదా అని ప్రశ్నించారు. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ కాలనీలకు మున్సిపల్ ప్రాంత కాలనీలకు ఎందుకు తేడా ఉంటుందని ప్రశ్నించారు. వారం రోజుల్లో పారిశుధ్యం మెరుగుపడకపోతే ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. ఇంజనీర్లు మీ గౌరవాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో 30 నుంచి 40శాతం లెస్‌కు టెండర్లు వేసే కాంట్రాక్టర్లు ఎలా నాణ్యతతో పని చేస్తారని ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు ఇంజనీర్లకు ఉన్న సంబంధాలపై ఆరోపణలు వస్తున్నాయని, కాంట్రాక్టర్లే అధికారులు మా భాగస్వాములు అని చెప్పుకుంటున్నారంటే మీ పరిస్థితి ఏమిటో మీరే ఆలోచించుకోండంటూ పేర్కొన్నారు. దొంగ పనులు చేసేవారికి ఎట్టి పరిస్థితుల్లో సహకారం అందించవద్దని, నిజాయితీతో పని చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతుల ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా గమనించాలన్నారు. తాను ప్రతీ డివిజన్‌పై నిఘా పెట్టానని, రాత్రి పూట డివిజన్లలో పారిశుధ్యంపై పరిశీలన చేస్తున్నానని, ఇందుకు సంబంధించిన ఫొటోలు ఆయన అధికారులకు చూపించారు. ఎమ్మెల్యే కార్పొరేషన్ వ్యవహారాలపై లోతుగా స్పందించడంతో కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులు ఖంగుతిన్నారు. మరో సమావేశంలో మార్పు కనబడకపోతే ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయన్నారు.

ఆటో ట్రాలీ బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ల ఆటో ట్రాలీ

హుజూరాబాద్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సిలిండర్ గ్యాస్ లోడ్‌తో వెళ్తున్న ఆటో ట్రాలీని ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా తృటిలో ప్రమాదం తప్పింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్యాస్ సిలిండర్‌లతో వెళ్తున్న ఆటో ట్రాలీని వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో మంగళవారం ఢీకొట్టింది. దీంతో ట్రాలీ నడిరోడ్డుపై బోల్తా కొట్టింది. అందులో ఉన్న గ్యాస్ సిలిండర్లు చెల్లాచెదురయ్యాయి. కొన్ని సిలిండర్లు లీక్ అయ్యాయి. ట్యాంకర్ డ్రైవర్ తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేయగా ట్యాంకర్ టైర్ కింద గ్యాస్ సిలిండర్ చిక్కుకు పోవడంతో లారీ ముందుకు కదలలేదు. ఆటో ట్రాలీలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, 108వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సిలిండర్లు చెల్లాచెదురు అయ్యాయి. ఆటోలో గ్యాస్ సిలిండర్లు ఉండటంతో ఏ జరుగుతుందోనని వాహనదారులు భయపడ్డారు. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో వాహనదారులు, ప్రయాణీకులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

ఇల్లంతకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారంపేట గ్రామానికి చెందిన గొట్టం నవీన్ (26) అనే యువకుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీఆటో నడుపుకుంటూ జీవించే నవీన్ సోమవారం మామిడి కాయలు తీసుకొని నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇండ్లవాయి సమీపంలో అర్ధరాత్రి లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు.

ఇసుక లారీలను అడ్డుకున్న నాయకులు



ఇసుక లారీలను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు

మానకొండూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. మండలంలోని ఊటూర్ మానేరు వాగులోని ఇసుక రీచ్ నుంచి సరఫరా చేస్తున్న ఇసుక లారీలతో రోడ్డు చెడిపోవడమే కాకుండా దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యం, ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇసుక లారీలను నూతనంగా నిర్మించే బైపాస్ నుంచి తరలించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, పిట్టల మధు, బోడ రాజశేఖర్, ఎస్‌కే అబూద్ నాయకులు పాల్గొన్నారు.



- దామిని యాప్ రూపొందించిన వాతావరణ శాఖ
- ఎరుపు, పసుపు, నీలి రంగుల ద్వారా పిడుగుపాటు సమాచారం

వెల్గటూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పిడుగు అనగానే ప్రతీ ఒక్కరు భయాందోళనకు గురి అవుతుంటారు. ఈ నేపథ్యంలో అనేక పరిశోధనలు చేసిన భారత వాతావరణ శాఖ పిడుగుపాటును ముందే పసిగట్టేలా ఓ యాప్‌ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటరాలజీ (ఐఐటీఎం) ఆధ్వర్యంలో 'దామిని లైటింగ్ ఎలర్ట్' యాప్‌పై రూపొందించింది. పొలాల్లో పనులు చేస్తున్న సమయంలో, పశువుల కాపరులు పశువు లను మేపుతున్న సమయంలో అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడగానే సమీపంలో చెట్టు కిందికి వెళ్లి నిల్చుంటారు. ఎత్తైన చెట్టుకే పిడుగు వేస్తుందని తెలియక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పిడుగుపాటుతో పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టే యాప్ ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు.

● పిడుగుపాటును ఇలా గుర్తించవచ్చు..

మీరు ఉన్న ప్రదేశంలో పిడుగు ఎంత సమయంలో సంభవిస్తుందో హెచ్చరించేలా యాప్‌లో ఎరుపు, పసుపు, నీలం రంగుల్లో చూపిస్తుంది. దీని ద్వారా పిడుగు పాటు ప్రమాదాన్ని ముందే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.

● ఎరుపు రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో పిడుగుపడే అవకాశం ఉంటే 7 నిమిషాల ముందుగానే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి వస్తుంది.

● పసుపు రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాల లోపు పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగుగా మారుతుంది.

● నీలం రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో 18 నుంచి 25 నిమిషాల లోపు పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులో కనిపిస్తుంది.

● యాప్ డౌన్ లోడ్ చేసుకునే విధానం

స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతీ ఒక్కరు ప్లే స్టోర్ నుంచి దామిని లైటింగ్ ఎలర్ట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ప్లే స్టోర్‌లో దామిని యాప్ అని టైప్ చేయాలి. యాప్ ఓపెన్ కాగానే పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం జీపీఎస్ లోకేషన్‌లో యాప్‌ను వినియోగించే సమయంలో మీ ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో, లేదో మూడు రంగుల్లో సూచిస్తుంది.

● పాటించాల్సిన జాగ్రత్తలు

- మొబైల్ సిగ్నల్స్ పిడుగు పడే అవకాశాన్ని ఎక్కువ కల్పిస్తాయి. మబ్బులు ఉన్న సమయంలో పంట పొలాల్లో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం మంచిది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాలు, సెల్‌ఫోన్ టవర్లు, బోరు పంప్ సెట్లకు దూరంగా ఉండాలి.
- పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశం ఎక్కువగా ఉండడంతో వర్షం కురిసే సమయంలో వాటి కింద ఉండవద్దు.

అన్నదాతలకు ఉపయోగకరం
-సాయికిరణ్, ఏవో వెల్గటూర్



పిడుగుపాటును ముందే పసిగట్టే దామిని యాప్ ప్రజలకు ముఖ్యంగా అన్నదాతలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు ఈ యాప్‌ను వినియోగించేలా అవగాహన పెంచుకోవడం మంచిది. పిడుగుపడే అవకాశం ముందే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.

వివాహిత ఆత్మహత్యపై బంధువుల ఆందోళన

● భర్త, అత్తమామల అరెస్ట్ ● గ్రామంలో పోలీసుల బందోబస్తు



భర్త ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బంధువులు

సిరిసిల్ల క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు మండలం ముప్పిడితోటకు చెందిన పురెల్ల ప్రవళ్లిక(28) ఆత్మహత్యకు ఆమె భర్త మద్దికుంట ప్రశాంత్ వేధింపులే కారణమంటూ మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు గ్రామంలో పుట్టింటివారు, బంధువులు ధర్నాకు దిగారు. పురెల్ల ప్రవళ్లికకు రెండేళ్ల క్రితం పెద్దూరుకు చెందిన ప్రశాంత్‌తో వివాహమైంది. వివాహ సమయంలో రూ.12లక్షల వరకట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయినప్పటికీ భర్త వేధింపులు భరించలేక తల్లిగారింటి వద్దనే మే 10న గడ్డిమందు తాగి ప్రవళ్లిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు జూలపల్లి పోలీస్ స్టేషన్‌లో భర్త ప్రశాంత్‌తో పాటు ఆడపడుచులు, అత్త, మామలపై కేసు నమోదైంది. ఈ కేసులో నుంచి అత్త, మామ, ఆడపడుచులను తొలగించాలని వివాహ సమయంలో ఇచ్చిన వరకట్నం రూ.12లక్షలు, ఇతర లాంఛనాలకు సంబంధించిన ఖర్చుతో పాటు అన్ని కలిపి అదనంగా రూ.25 లక్షలు ఇవ్వాలని పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరిగింది. అయితే ప్రవళ్లికకు పెట్టిన బంగారం ఎక్కడ ఉందనే దానిపై క్లారిటీ లేకపోవడంతో ఘర్షణకు దారితీసింది. చివరికి బంగారం విషయం తేలడంతో పెద్దమనుషుల సమక్షంలో రాసిన రాజీ కాగితాన్ని చింపేసి భర్త తరఫున వెళ్లిన వారంతా ముప్పిడితోట నుంచి పెద్దూరుకు వచ్చేశారు. భార్య ప్రవళ్లిక ఆత్మహత్య చేసుకొని 25రోజు లైనప్పటికీ పోలీసులు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ముప్పిడితోట నుంచి వాహనాలలో దాదాపు 50నుంచి 70మంది వరకు మహిళలు తరలి వచ్చి పెద్దూరులోని భర్త ప్రశాంత్ ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. ఈ ధర్నాతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ తమకు న్యాయం చేయాలని ఇంటి ఎదుట బైఠాయించిన ప్రవళ్లిక బంధువులు, మహిళలు పట్టుబట్టారు. చివరికి పోలీసు లు జోక్యం చేసుకొని సముదాయించినప్పటికీ వెంటనే భర్త, అత్త, మామలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇక్కడి పోలీసులు జూలపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో అక్కడి నుంచి వచ్చిన పోలీసులు భర్త ప్రశాంత్, అత్తమామలను అరెస్ట్ చేసి జూలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడి

ఓదెల, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూరులో సోమవారం రాత్రి పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో నాటుసారా బట్టీలపై దాడి చేశారు. 500 లీటర్ల బెల్లం పానకం, ఐదు లీటర్ల నాటు సారా పట్టుకోగా తయారు చేస్తున్న బోదాసు పద్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పాల్పడితే ఉపేక్షించేది లేదని, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం, నాటుసార తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సెల్ నంబర్ 8712656514కు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కిషన్, కానిస్టేబుళ్ల రాజేందర్, రాములు పాల్గొన్నారు.

ఎల్ఎండీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు జలాశయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మంగళవారం జలాశయం మొదటి గేట్ వద్ద నీటిపై తేలియాడుతున్న వ్యక్తి మృతదేహాన్ని లేక్ పోలీసులు గుర్తించి కొత్తపల్లి పోలీసులకు సమాచారం అందించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, బ్లూ జీన్‌ప్యాయింట్, బ్లాక్ అండ్ వైట్ చెక్స్ ఫుల్‌షర్ట్ ధరించాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, గుర్తించినవారు కొత్తపల్లి పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం ఆచంపల్లిలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం ఎలగందుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 03: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఏడుగురు రైతులు 85క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7,550, కనిష్ఠ ధర రూ.7,400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటలో 1.2 కిలోల గంజాయి పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో బావుపేటలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఒక చికెన్‌సెంటర్ వద్ద రాంపర్వేష్ సాయిని(40) అనే బీహార్‌కు చెందిన గ్రానైట్ కార్మికుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 1.2 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడు బీహార్ నుంచి గంజాయిని బావుపేటకు తీసుకువచ్చి ఇక్కడి యువతకు 500 రూపాయలకు ఒక పాకెట్ చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుడి అరెస్టు చేసినట్లు, గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సీఐతో పాటు ఎస్సై సాంబమూర్తి, సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ అభినందించారు.

ఏసీబీ వలలో రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్

● భూమి రిజిస్ట్రేషన్‌కు రైతు నుంచి రూ.15 వేలు లంచం డిమాండ్ ● రూ.10వేలు తీసుకుంటుండగా పట్టివేత



ఏసీబీకి పట్టుబడిన రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్, డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్

రాయికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతు నుంచి డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా రాయికల్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్‌ను మంగళవారం కరీంనగర్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం సింగ్రావుపేట గ్రామ శివారులోని 42.5 గుంటల వ్యవసాయ భూమిని రవి అనే రైతు ఇతరులకు విక్రయించాడు. అనంతరం భూమిని కొన్నవారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్‌ను మూడు రోజుల క్రితం కలిశాడు. రైతు విక్రయించిన భూమిలో 16 గుంటలు కెనాల్ భాగానికి వెళ్తుందని చెప్పి ఇన్‌చార్జి తహసీల్దార్ రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.10 వేలు ఇచ్చేందుకు అంగీకరించిన రైతు రవి ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏసీబీ అధికారులు సూచన మేరకు మంగళవారం డాక్యుమెంట్ రైటర్‌కు బాధితుడు రవి రూ.10 వేలు ఇచ్చాడు. అనంతరం డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్ నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్, డాక్యుమెంట్ రైటర్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు.

ఇంటికి నిప్పంటించిన దుండగులు



కాలిపోయిన వస్తువులు

వేములవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్‌లో ఎండ్రాల దేవయ్య ఇంటికి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు పైఅంతస్తు, కింద భాగంలోనూ డీజిల్‌ను చల్లి నిప్పంటించినట్లు అనుమానిస్తున్నారు. ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తి కాలుతున్న వాసన గమనించి బయటకు వచ్చి చూడగా అప్పటికే కాలుతున్న వస్తువులను చూసి ఇంటి యజమానికి సమాచారం అందించడంతో సకాలంలో మంటలను ఆర్పారు. ఈ సంఘటనపై వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవయ్య తెలిపారు.

తండ్రిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన కుమారుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య

చందుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి తల్లిని వేధిస్తున్నాడని కక్ష గట్టి తండ్రిని హత్య చేసిన సంఘటనలో నిందితుడిని మంగళవారం చందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీఐ వెంకటేశ్వర్లు హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సీఐ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలం దేవునితండాకు చెందిన జాటోత్ తిరుపతి తన భార్యతో తరుచూ గొడవ పడుతుండేవాడని, గొడవల కారణంగా తిరుపతి కొడుకు జటోత్ రాజేష్ తన తండ్రిపై పలుమార్లు దాడి చేశాడు. దాడి సంఘటనలపై రాజేష్‌పై చందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదు అయినాయని, ఆ కేసులు కోర్టులో ట్రయల్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 2 మధ్యాహ్నం సమయంలో తిరుపతి మళ్లీ తన భార్యతో గొడవపడుతున్నాడని సమాచారం అందడంతో, ఆవేశంతో రాజేష్ తన కారులో తన ఇంటికి వస్తుండగా, తండ్రి తిరుపతి రోడ్డుపై నిల్చోని ఉండగా, తరచూ ఇలాగే గొడవలు చేస్తున్నాడని కక్ష గట్టి తన కారుతో తన తండ్రిని బలంగా ఢీకొట్టి తిరుపతిపైకి పలుమార్లు కారును ఎక్కించగా స్పృహ తప్పి రక్తం మడుగులో పడిపోయాడు. స్థానికులు అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా హస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్‌లు పేర్కొన్నారు.

తండ్రిని కక్ష పూరితంగా హత్య చేసిన రాజేష్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును త్వరగా విచారించి నేరస్తుడైన రాజేష్‌కు కోర్టు ద్వారా శిక్ష పడేలా కృషి చేస్తానని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



పేరు నమోదు చేసుకుంటే పలు ప్రయోజనాలు

గణేశ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువత కోసం మై భారత్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. 15 నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులు ఇందులో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. నిరుద్యోగ యువత సాధికారత సాధించడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. ఇందులో దేశవ్యాప్తంగా విద్య, ఉద్యోగావకాశాలు, పలు రకాల కోర్సులు, తదితర అంశాలపై ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తున్నారు. www.myb-harath.gov.in వెబ్‌సైట్లో నమోదుకు అవకాశం కల్పించారు. ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్టర్ నౌ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే వివరాలు అడుగుతుంది. ఆ వివరాలన్నీ నమోదు చేస్తే రిజిస్టర్ అవుతుంది. తర్వాత వివిధ కార్యక్రమాల అప్‌డేట్స్ రిజిస్టర్ చేసుకున్న వారికి మెసేజ్, ఈ మెయిల్ రూపంలో వస్తాయి. పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకున్న యువతను నాలుగు ప్రధాన అంశాలతో అనుసంధానం చేస్తున్నారు.

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన అర్హతలపై అవగాహన కల్పించడం.
- ఎంచుకున్న రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు అవకాశాలు, వసతులను వివరించడం.
- సామాజిక బాధ్యత పెంపొందించేందుకు యువత ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా వివిధ సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపట్టడం.
- వ్యాపారాల్లో యువత రాణించేలా ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ)లో రాయితీ ఎలా పొందాలన్న సమాచారం పోర్టల్లో వ్యాపార, అందుబాటులో ఉంటుంది. పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడే అవకాశం కల్పించి సందేహాలు నివృత్తి చేస్తారు.

● ఉపాధికి బాటలు..

డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతలో నైపుణ్యం ఉన్నా వారికి సరైన ప్రోత్సాహం అందడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలున్నా అందుకోలేకపోతున్నారు. ఆర్థిక స్థోమత లేక పరిశ్రమల స్థాపనలో ఇబ్బందులు పడుతున్నారు. వీటిని అధిగమించేందుకు మై భారత్ పోర్టల్ వేదిక కానుంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఇతర ఉన్నత విద్య చదువుతున్న వారి ప్రతిభ ఆధారంగా ఉపాధి పొందేందుకు మార్గ నిర్దేశం చేయనున్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి
- వెంకట రాంబాబు, ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి



మై భారత్ పోర్టల్ ప్రయోజనాలపై విద్యా సంస్థల్లో ప్రచారం చేస్తున్నాం. జిల్లాలోని యువతీ, యువకులు తమ పేర్లు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

తాగుడుకు బానిసై యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసగా మారిన యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన బాస కరుణాకర్(31) తల్లిదండ్రులతో కలిసి కరీంనగర్ మారుతీ నగర్‌లో ఓ ఇంటిలో అద్దెకుంటున్నాడు. తండ్రితోపాటు గ్రానైట్ ఫ్యాక్టరీలో కూలీగా పని చేసేవాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. గత నెల 30న తండ్రి, సోదరి బంధువుల వివాహానికి హైదరాబాద్ వెళ్లారు. తల్లితోపాటు కరుణాకర్ ఇంటి వద్ద ఉన్నాడు. సోమవారం రాత్రి 8 గంటలకు కరుణాకర్ మద్యం తాగి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటి ముందు రోడ్డుపై కాలిన గాయాలతో యువకుడు మృతి చెంది ఉండడాన్ని గమనించి స్థానికులు గుమిగూడారు. అక్కడికి వెళ్లిన తల్లి యువకుడిని తన కొడుకు కరుణాకర్‌గా గుర్తించింది. ఆత్మహత్యకు ముందు 'నేను చాలా దూరం వెళుతున్నాను.. చాలా తప్పు చేశాను. కాళ్లు మొక్కడం, దండంపెట్టడం తప్ప చేసేది ఏమీ లేదు. అమ్మ, నాన్నలను జాగ్రత్తగా చూసుకోవాలి' అని కరుణాకర్ తెల్లవారు జామున 3:54 గంటలకు తన సోదరికి వాట్సప్‌లో వాయిస్ మెసేజ్ పంపించాడు. తాగుడుకు బానిసగా మారి నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్న కరుణాకర్ తప్పుచేశానని గ్రహించి క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి రైతు మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌లో రైతు కరికె నాంపల్లి(65) ప్రమాదవశాత్తు తన వ్యవసాయ బావిలో పడి మంగళవారం మృతి చెందాడని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు... గ్రామంలోని నాంపల్లి తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తుండేవాడు. యాసంగి వరి పంట కోత అనంతరం వానాకాలం పంట సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నాడు. వ్యవసాయ బావి చుట్టూ ఉన్న ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. చీకటి పడినా భర్త నాంపల్లి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య శంకరవ్వ వ్యవసాయ పొలం వద్దకు చేరుకుంది. చుట్టుపక్కల గాలించడంతో వ్యవసాయ బావి గట్టు వద్ద చెప్పులు కనిపించాయి. కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో నాంపల్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య శంకరవ్వ, వివాహమైన కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రాజన్న కోడెల సంరక్షణకు పకడ్బందీ చర్యలు

● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ



తిప్పాపూర్ గోశాలలో ఉన్న రాజన్న కోడెలు

వేములవాడ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో అకాల వర్షాలు, అనారోగ్య కారణాలు, పరిమితికి మించి కోడెలు ఉండటంతో కోడెల సంరక్షణపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం గోశాలను సందర్శించి దగ్గరుండి పలు పనులను చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాలలో పక్కా ప్రణాళికతో పనులు చేయిస్తున్నామన్నారు. గోశాల ఆవరణలో గుంతలు పడిన చోట, బురద, మిగతా స్థలాల్లో మొరం పోయించి చదును చేయించామన్నారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చి గడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి, త్వరగా అందేలా ఏర్పాట్లు చేశామని, ఐదు వెటర్నరీ వైద్యుల బృందం గోశాలలో ఉండి సేవలు అందిస్తున్నారన్నారు. పచ్చి గడ్డి సరఫరా కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి రోజు సరఫరా చేసే ఒక ట్రాక్టర్ గడ్డికి బదులుగా రోజు 10 టన్నుల (5ట్రాక్టర్‌ల) పచ్చి గడ్డిని అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

అనారోగ్యంతో మరో ఆరు కోడెల మృతి

● మరో నాలుగు కోడెల అస్వస్థత ● ఇప్పటికీ 26 మృతి

సిరిసిల్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యానికి గురైన మరో ఆరు కోడెలు మంగళవారం మృతిచెందాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. రాజన్న కోడెల హెల్త్ బులిటెన్‌ను ఆయన విడుదల చేశారు. అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల వల్ల తిప్పాపూర్ గోశాలలో మొదటి రోజు 8 కోడెలు, రెండో రోజు 5 కోడెలు, మూడో రోజు 4 కోడెలు, నాలుగో రోజు 3 కోడెలు, మంగళవారం 6 కోడెలు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు గోశాలలో 26 కోడెలు మృతిచెందినట్లు తెలిపారు. ప్రస్తుతం గోశాలలో 1300 పశువుల్లో 14 పశువులు అనారోగ్యంతో బాధపడుతుండగా, కొత్తగా మరో 4 అనారోగ్యం బారిన పడ్డాయని, డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న వయస్సు గల పశువులు, పెద్ద వయస్సుల గల పశువులు ఒకేచోట ఉండడం వల్ల మరణాలు సంభవిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు సమర్పించే కోడెలు తప్పనిసరిగా సంవత్సరంన్నర కంటే ఎక్కువ వయస్సు ఉండాలని సూచించారు.

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీబద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి ఆలయంలోకి ప్రవేశించారు. ముందుగా అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలతో ఒడిబియ్యాన్ని సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పాడిపంట, పిల్లపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

ఖని బస్టాండ్ నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ నుంచి ఈ నెల 9న తమిళనాడులోని అరుణాచలంకు ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. ఈ నెల 9న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరి పెద్దపల్లి, కరీంనగర్ మీదుగా కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, మహాలక్ష్మి టెంపుల్, వేలూరు పుణ్యక్షేత్రాల గుండా 10న రాత్రి 10గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణచల గిరి ప్రదక్షిణ అనంతరం 11న సాయంత్రం 3 గంటలకు తిరుగు ప్రయాణంలో జోగులాంబ మీదుగా 12న సాయంత్రం 6 గంటలకు గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. గోదావరిఖని నుంచి అరుణాచలంకు పెద్దలకు రూ.4,850, పిల్లలకు రూ.4100, కరీంనగర్ నుంచి పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,800 ధర నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7013504982, 7989847927 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేషన్ పంపిణీలో మారిన నిబంధనలు



- కేంద్రం, రాష్ట్రానికి వేర్వురుగా వేలిముద్రలు
- బియ్యం పంపిణీలో జాప్యం
- లబ్ధిదారులకు ఇబ్బందులు

చొప్పదండి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని రాంనగర్ కు చెందిన అనిత శ్రీరామ టాకీస్ సమీపంలోని రేషన్ షాప్‌నకు ఆదివారం వచ్చింది. మూడు నెలల బియ్యం ఒకేసారి వస్తాయని ఆమె సంతోషంతో ఉందిది. అప్పటికే అక్కడ 50 మంది వరకు లబ్ధిదారులు ఉండడంతో రేషన్ కార్డులను వరుస క్రమంలో పెట్టాడు డీలర్. రెండు గంటల వరకు తన నంబర్ వస్తుందని అనిత ఎదురు చూ సింది. ఆదివారం ఆమె నంబర్ రాలేదు. సోమవారం గడిచింది. మంగళవారం సాయం త్రం వరకూ ఆమె వంతు రాలేదు. దీంతో నిరాశగా ఆమె వెనుదిరిగింది. ఇందుకు కారణం మారిన నిబంధనలు. చొప్పదండి మండలంలోని అన్ని రేషన్ దుకాణాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

● బయోమెట్రిక్‌లో ఆలస్యం

రేషన్ బియ్యం పంపిణీ లో ఈ పాస్ విధానంలో ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా బయో మెట్రిక్ వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. ఈ నెల నుంచి కొత్త నిబంధనలు అమలు చేయాలని అధికారులు ఆదే శించారు. ప్రతి లబ్ధిదారుడు రెండు సార్లు వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది. ఒక సారి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5 కిలోల బియ్యానికి, మరో సారి రాష్ట్రం ఇచ్చే కిలో బియ్యానికి వేలి ముద్రలు వేయాలి. ఇదే సమయంలో డీలర్ రెండు సార్లు తూకం వేసి లబ్ధిదారుడి ఫోన్ నంబర్ నమోదు చేయాలి. డీలర్ల వద్ద మొబైల్ సిగ్నల్ సరిగ్గా అందక సర్వర్ సమస్య ఏర్పడుతోంది. దీంతో బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇక పై ప్రతి నెల ఇదే విధంగా బయో మెట్రిక్‌లో లబ్ధిదారులు వేలుముద్రలు వేయాల్సి ఉంటుంది. ఈ సారి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకే సారి లబ్ధిదారులకు అందజేస్తున్నారు.



● మూడు నెలల బియ్యం పంపిణీతో ముప్పుతిప్పలు

ఒక నెలకు సంబంధించి లబ్ధిదారుడు రెండు సార్లు వేలిముద్రలు వేయగా డీలర్ రెండు సార్లు తూకం వేస్తున్నాడు. మూడు నెలల బియ్యం కోసం ఆరు సార్లు వేలిముద్రలు, ఆరు సార్లు తూకం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో లబ్ధిదారుడుకి బియ్యం పంపిణీ కోసం 15 నుంచి 20 నిముషాల సమయం పడుతుంది. ప్రతి రోజు 20 మందికి మించి బియ్యం పంపిణీ జరుగడం లేదని డీలర్లు, లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకే రోజు వందలాది మందికి బియ్యం పంపిణీ చేసిన డీలర్లు మారిన నిబంధనలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలోని ప్రతి రేషన్ షాప్ ముందు ప్రజలు బారులు తీరి ఉండి రోజుల తరబడి బియ్యం కోసం పడిగాపులు కాయల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి.

రోజు రేషన్ షాప్ వద్ద ఉండాల్సి వస్తుంది

\- వనిత, చొప్పదండి



మూడు నెలల బియ్యం ఒకే సారి వస్తున్నాయని ఎంతో సంతోష పడ్డాను. మూడు రోజులుగా షాప్ వద్దనే ఉంటున్నాను. బియ్యం పంపిణీలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంతకు ముందు ఎప్పుడైన ఒకే రోజులో బియ్యం తీసుకుపోయే వాళ్లం. ఇప్పుడు నిబంధనలు మారాయని అంటున్నారు. తొందరగా బియ్యం అందేలా అధికారులు చూడాలి.

కొత్త నిబంధనలతో ఇబ్బందులు..

\- కొక్కుల రాంమోహన్, డీలర్, చొప్పదండి



రేషన్ బియ్యం పంపిణీ లో కొత్త నిబంధనలు అమలు చేయడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి ఇరవై నిముషాల సమయం పడుతుంది. షాప్ ఎదుట లబ్ధిదారులు బారులు తీరి ఉంటున్నారు. ఆరు సార్లు తూకం వేసి వేలిముద్రలు నమోదు చేయడంతో బియ్యం పంపిణీలో చాలా జాప్యం జరుగుతుంది.

హోరాహోరీగా ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు

\- కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, వేములవాడ జట్ల విజయం
\- కరీంనగర్ టౌన్ క్రీడాకారుడు రిత్విక్ సూర్య డబుల్ సెంచరీ



రిత్విక్ సూర్య

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-25 లీగ్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లలో కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, వేములవాడ జట్లు గెలుపొందాయి. జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ మైదానంలో కరీంనగర్ రూరల్, పెద్దపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ రూరల్ జట్టు 5 వికెట్ల తేడాతో పెద్దపల్లి జట్టుపై విజయం సాధించింది. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో కరీంనగర్ టౌన్, హుజూరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ టౌన్ జట్టు 224 పరుగుల భారీ ఆధిక్యంతో గెలుపొందింది. వేములవాడలో వేములవాడ, జగిత్యాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వేములవాడ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లను కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు ఆగమరావు, మురళీధర్‌రావు, మహేందర్ గౌడ్, మనోహర్‌రావు, నితిన్ పర్యవేక్షించారు.

● ఆకట్టుకున్న రిత్విక్ సూర్య

కరీంనగర్ టౌన్ జట్టుకు చెందిన రిత్విక్ సూర్య హుజూరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 ఫోర్లు, 10 సిక్స్‌లతో 220 పరుగులు చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ జట్టుకే చెందిన మన్నిత్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించాడు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయం వద్ద భక్తులు

మల్యాల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. విద్యాసంస్థలు త్వరలోనే పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండి అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. క్యూలైన్‌ల వద్ద నీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో వాహనాలు బారులు తీరగా వైజంక్షన్, పార్కింగ్ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి భక్తులు ఇబ్బంది పడ్డారు.

రెండిళ్లలో చోరీ

గంగాధర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం వీరారెడ్డి గత నెల 31న కరీంనగర్‌లో బంధువుల వివాహం ఉండగా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మంగళవారం వీరారెడ్డి పక్కింటి వారు ఫోన్‌చేసి మీ ఇంటి తాళం పగులగొట్టి ఉంది, తలుపులు తీసి ఉన్నాయని తెలిపారు. వీరారెడ్డి మంగళవారం వచ్చి చూడగా తాళం పగుల గొట్టి, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో బీరువాలో దాచిన 2లక్షలు చోరీకి గురయ్యాయి. వీరారెడ్డి ఇంటికి కొద్ది దూరంలోని కనకట్ల ఎల్లవ్వ ఇంట్లో నాలుగు వేల విలువైన రెండు ఇత్తడి బిందెలు, రెండు బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లారు. ఏఎస్సై శుభం ప్రకాశ్ ఆధ్వర్యంలో బాధిత ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో..

● ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ● ఏడాది ప్రోగ్రెస్ రిపోర్టు విడుదల



ఎంపీగా గెలిచిన తర్వాత ర్యాలీలో బండి సంజయ్‌కుమార్ (ఫైల్)

కరీంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర మంత్రిగా బిజీగా ఉన్నా నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ ఎంపీగా ఏడాది కాలం పూర్తవడంతో ఆయన తన ప్రోగ్రెస్ రిపోర్టును మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా రెండో సారి ఎన్నికై ఏడాది కాలం పూర్తవుతుందన్నారు. రెండో సారి ఎన్నికైన తనకు ప్రధాని మోదీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా అవకాశం కల్పించారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్-జగిత్యాల రహదారి విస్తరణకు రెండు వారాల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు.

● ఉపాధి హామీ కింద ప్రతి మండలానికి రూ. 2 కోట్లు

జాతీయ ఉపాధి హామి పథకం కింద ప్రతి మండలానికి రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆయా మండలాల్లో రోడ్లను నిర్మించామన్నారు. సగటున ఒక్కో గ్రామానికి ఐదు లక్షల రూపాయలు అంతర్గత రోడ్లకు ఖర్చు చేశామని ప్రకటించారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం 33 కోట్లకు పైగా ఖర్చు చేసి సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. కరీంనగర్, జమ్మికుంట ఆర్వోబీల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని సంబంధిత అధికారులతో సమీక్షించి వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆగస్టు నాటికి జమ్మికుంట ఆర్వోబీ నిర్మాణం పూర్తి కాకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని తెలిపారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణంలో ఇబ్బందులను అధిగమించేందుకు రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయించామన్నారు.

● త్వరలో వారానికి నాలుగు సార్లు తిరుపతి రైలు

కరీంనగర్-తిరుపతి రైలును వారానికి నాలుగుసార్లు నడిచేలా త్వరలో సానుకూల నిర్ణయం రాబోతుందన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతి పత్రం అందించామన్నారు. తన వినతిపత్రానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సిరిసిల్ల, హుస్నాబాద్ ప్రాంతాల్లో రెండు నవోదయ స్కూళ్లు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని, దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రసిద్ధ ఆలయాలను టూరిజం సర్క్యూట్‌గా మార్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అందులో భాగంగా సాక్సీ (ఎస్‌ఏసీఎస్‌ఐ) పథకం కింద అధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందని చెప్పారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కళాశాల ఏర్పాటు కోసం వీసీ, మాజీ మేయర్ సునీల్‌రావులతో కలిసి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కలిసి మంజూరు చేయించామన్నారు. ఈ ఏడాది నుంచి లా కాలేజీలో అడ్మిషన్లు కూడా ప్రారంభం కాబోతున్నాయన్నారు. అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ పార్క్, స్పోర్ట్స్ రిక్రియేషన్ సౌకర్యాలు కల్పించాలని చేసిన ప్రతిపాదనకు కేంద్ర క్రీడా శాఖ సుముఖత వ్యక్తం చేసిందన్నారు. కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటవుతుందన్నారు.

● డంప్‌యార్డ్ సమస్యకు త్వరలో పరిష్కారం

కరీంనగర్ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న డంప్‌యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం హామీ ఇవ్వడంతో పాటు, నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏడాదికాలంగా ఐదు కోట్ల రూపాయలతో వేములవాడ, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక వైద్య పరికరాలను అందించామన్నారు. పదో తరగతి వరకు చదివే ఆరు వేల మంది బాలికలకు ప్రత్యేకంగా సైకిళ్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కేంద్ర మంత్రిగా బిజీగా ఉన్నప్పటికి ఓట్లేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు.

ఎంకామ్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ఉచిత కోచింగ్

గణేశ్‌నగర్,జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఎంకామ్ ప్రవేశ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించినట్లు వక్తలు తెలిపారు. ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కరీంనగర్, కాకతీయ గవర్నమెంట్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) హనుమకొండ ఆధ్వర్యంలో తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఎంకామ్ ప్రవేశ పరీక్ష 2025 కోసం మంగళవారం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ప్రభుత్వ కళాశాలలు, అధ్యాపకులు ఉత్తమ సేవలు అందించడానికి ముందుంటారన్నారు. సీనియర్ ప్రొఫెసర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఉస్మానియా యూనివర్సిటీ, తెలంగాణ కామర్స్‌అసోసియేషన్ ప్రెసిడెంట్ చెన్నప్ప, జీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదు రోజుల జైలు శిక్ష

కోల్‌సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడిన శనిగరపు సుమన్ అనే వ్యక్తికి మంగళవారం గోదావరిఖని రెండవ అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి వెంకటేష్ ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో అతన్ని కరీంనగర్ జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. మరో నలుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది..



కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్

- హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్స్
- నాలుగో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్
- రాష్ట్రవ్యాప్తంగా 60 మంది బాలురు, 60 మంది బాలికలకు అవకాశం
- జూలై 8 నుంచి హకీంపేటలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులుగా ఎదగాలనుకునేవారికి విద్యార్థులకు మంచి అవకాశం క్రీడా పాఠశాలలు. రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాల్లో 21025-26 విద్యాసంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ఉన్నాయి. ఈ సంవత్సరానికి నాలుగు తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభచాటి ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ఈ పాఠశాలల్లో ప్రవేశం పొందుతారు. రాష్ట్రంలోని మూడు పాఠశాలల్లో 60 మంది బాలురు, 60 మంది బాలికలు నాలుగో తరగతిలో చేరేందుకు అవకాశం ఉంది. మండల జిల్లా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి 20 మంది బాలురను, 20 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు.

● ప్రవేశాల షెడ్యూల్...

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంపిక పోటీలను ఆయా మండల కేంద్రాల్లో ఈ నెల 16 నుంచి 25 వరకు నిర్వహిస్తారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారు లకు జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన 20 మం ది బాలురను, 20 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయి పోటీలు హకీంపేటలోని క్రీడా పాఠశాలలో జూలై 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

● విద్యార్థులకు నిర్వహించే శారీరక పరీక్షలు...

మండలస్థాయిలో మొదట విద్యార్థుల అర్హత పత్రాలను పరిశీలించి బరువు, ఎత్తు, ఫ్లెక్సిబిలిటీ అంశాల్లో పరీక్షలను నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలోనూ ఇవే పరీక్షలను నిర్వహిస్తారు. వీటితోపాటు విద్యార్థులకు అన్ని దశల్లో 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 610 షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. ఒక్కో అంశానికి మూడు మార్కుల చొప్పున ఏడు అంశాలకు 21 మార్కులు ఉంటాయి. విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహిస్తారు. వయస్సు ధ్రువీకరణ పరీక్షతోపాటు శారీరక పటుత్వం, బొక్కల పటిష్టత అంశాలను పరీక్షిస్తారు.

- మొత్తం పరీక్షల్లో 15 మార్కులకుపైగా వచ్చిన విద్యార్థులందరు అర్హులుగా భావిస్తారు.
- విద్యార్థుల వయస్సు 8 నుంచి 9 సంవత్సరాలు ఉన్నవారు అర్హులు.

● క్రీడా విభాగాల్లో శిక్షణ...

అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోయింగ్, వాలీబాల్, జూడో, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడాంశాలతోపాటు ఖోఖో, కబడ్డీ అంశాల్లో ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ అందిస్తారు. క్రీడా పాఠశాలలో ఉత్తమమైన క్రీడాకారులుగా ఎదిగిన వారికి రైల్వే, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, పోలీస్, బ్యాంక్స్, పోస్టల్ శాఖ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా కోచ్‌లు, కార్పొరేట్ సెక్టార్లలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది.

● కావలసిన పత్రాలు...

విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు మున్సి పాలిటీ, పంచాయతీ నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఆధార్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్, మూడో తరగతి పాస్ సర్టిఫికెట్, మూడో తరగతి ప్రగతి పత్రంతో జిల్లా, రాష్ట్ర ఎంపికలకు హాజరు కావాలి.

● సదుపాయాలు

క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పిస్తుంది. ఉచిత విద్య, భోజన, వసతి సౌకర్యాలు, ప్రతి సంవత్సరం రెండు ట్రాక్ సూట్లతోపాటు, క్రీడా దుస్తులను, స్పోర్ట్స్ షూస్‌ను ప్రభుత్వం అందిస్తుంది. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రంశిక్షణ ఉంటు ంది. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యే విద్యార్థులకు ప్రయాణ భత్యాలు అందిస్తారు.

విద్యార్థులకు సువర్ణావకాశం...

\- ఎ శ్రీనివాస్ గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్



క్రీడాకారులుగా ఎదగాలనుకునే వారికి ఇది సువర్ణావకాశం. క్రీడా పాఠశాలల్లో విద్యను అభ్యసించిన అనేకమంది అంతర్జాతీయ స్థాయితోపాటు ఒలింపిక్స్‌లాంటి మెగా ఇవెంట్లలో పాల్గొని సత్తాచాటారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన శిక్షణను క్రీడా పాఠశాలల్లో అందిస్తారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

ఫలించిన పోరాటం

(5వ పేజీ తరువాయి)

వ్యాప్తంగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. దీంతో అప్పటి ప్రభుత్వం, అధికారులు ప్రయోజనాలను పెంచుతామని హామీ ఇవ్వడంతో అక్టోబర్ 4న సమ్మె విరమించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో హామీ నెరవేరలేదు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ సమస్యల పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో గతేడాది జూన్7న ఐసీడీఎస్ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేశారు. డైరెక్టర్ వారితో చర్చలు జరిపారు. జూన్ 17న మంత్రి సీతక్క మహబూబాబాద్ పర్యటనలో పదవీ విరమణ అనంతరం ఇచ్చే ప్రయోజనాలను పెంచుతామని ప్రకటించారు. కానీ అవేమి లేకుండానే ఏప్రిల్ 30 వరకు 65 ఏళ్లు నిండిన వారందరినీ తొలగించి, టీచర్లకు లక్ష, హెల్పర్లకు 50 వేల బెనిఫిట్స్ ఇవ్వాలని జూన్ 29న మెమో నంబర్. 1334/ఐసీడీఎస్-1/2024 జారీ చేశారు. ఆ మేరకు జిల్లాలో 26 మంది టీచర్లు, 73 మంది హెల్పర్లు ఉన్నట్లు గుర్తించి విధులకు హాజరు కావద్దని చెప్పారు. ఏడాది కాలంగా పదవీ విరమణ పొందిన చాలా మంది టీచర్లు, ఆయాలు పాత జీవో ప్రకారం ప్రయోజనాలను పొందలేదు. వారందరికీ పెంచిన ప్రకారం 2 లక్షలు, లక్ష ఇస్తారా, పాత జీవో ప్రకారం ఇస్తారా అనే విషయమై ప్రభుత్వం స్పష్టత ఇవ్వక పోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. పెంచిన పదవీ విరమణ ప్రయోజనాలను 2024 జులై 1వ తేదీ నుంచి రిటైర్డ్ అయిన వారందరికీ వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ బాధ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



హెల్త్ కార్డులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ తెలిపారు. మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న 18 మంది డ్రెయిన్ క్లీనర్లకు మంగళవారం ఎన్టీపీసీ మిలీనియం హాలులో ఆయుష్మాన్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షలతోపాటు ఆయుష్మాన్ హెల్త్ కార్డు ద్వారా అదనంగా రూ.5 లక్షల విలువైన వైద్యం అందుతుందన్నారు. త్వరలో మరికొందరు కార్మికులకు హెల్త్ కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థల సహకారంతో పారిశుధ్య కార్మికుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామన్, సూపరింటెండెంట్ పెబ్బాల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి, కిరణ్‌ఎన్విరాన్‌ఎంట్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

నేడు కల్వచర్లలో భూభారతి రెవెన్యూ సదస్సు

రామగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుమన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కారిస్తామని తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మాధవరావు శిబిరాన్ని ప్రారంబించారు. శిబిరంలో 120 మందికి ఆసుపత్రి కార్డియాలజిస్టు డాక్టర్ అనిష్ పబ్బ, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ లోకేష్ పరీక్షలు నిర్వహించారు. గుండె, సాధారణ వ్యాధులపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీఎకో పరీక్షలు చేశారు. అనంతరం ఎస్ఈ మాధవరావు మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బందికి సూపర్ స్పెషాలిటి వైద్య సేవలు అందించడం గొప్ప పరిణామమన్నారు. మెడికవర్ ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్, ఎన్‌పీడీసీఎల్ డీఈలు రవి, తిరుపతి,ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగొని హరిష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు పాఠశాల యాజమాన్యం అండ

ధర్మారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బూట్ల రాజేందర్ రజితల ఇద్దరు పిల్లలు ధర్మారం మండల కేంద్రంలోని స్మార్ట్ కిడ్స్ ప్లే స్కూల్‌లో చదువుతున్నారు. రాజేందర్ బతుకుదెరువు నిమిత్తం సౌదీ వెళ్లగా అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకున్న పాఠశాల ప్రిన్సిపాల్ బుధరపు రమాదేవి, కరస్పాండంట్ మహేందర్ ఇద్దరు పిల్లల్లో ఒకరికి ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. రాజేందర్ రజిత దంపతుల కూతరు నివంతికకు 1వ తరగతి నుంచి తమ పాఠశాలలో విద్య పూర్తయ్యేవరకు ఉచితంగా అందిస్తామని భరోసా కల్పించారు. ఇందుకు సంబంధించిన హామి పత్రాన్ని మంగళవారం నివంతిక తల్లి రజితకు పాఠశాల యాజమాన్యం అందించింది.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

పెద్దపల్లి రూరల్ , జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈవో సురేందర్‌కుమార్ ప్రారంభించారు. అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల పరిధిలోని గోదాం నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సీఆర్‌పీలు సుధాకర్, శ్రీనివాస్, తిరుపతి, శ్రీలత, సీసీవో రహీమొద్దీన్, శ్రావణ్‌కుమార్, సంధ్యారాణి, రజిని, సంపత్ పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

ఓదెల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రజకుల మౌలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రజకుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు గ్రామస్థాయి నుంచి మలిదశ పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. రజకులను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. 1982లో ఏర్పడిన రజక కార్పొరేషన్‌కు ఏ ప్రభుత్వం కూడా బడ్జెట్ కేటాయించలేదన్నారు. రజక యువత కోసం రూ.10 లక్షలు అందజేయాలని, వృద్ధులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రాపాల శంకర్, ఉపాధ్యక్షుడు కొల్లూరి కుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఈజీఎస్ గ్రామ సభలు

రామగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్, నాగేపల్లి, నవాబ్‌పేట్, రాజాపూర్ గ్రామాల్లో మంగళవారం ఈజీఎస్ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శైలజా రాణి ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై చర్చించారు. ఎంపీవో ఉమేశ్, ఈసీ లక్ష్మణ్, టీఏ సుప్రియ, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

6న గోదావరిఖనిలో సంస్మరణ సభ

గోదావరిఖని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నిర్బంధాలను ఎదుర్కొంటూ బొగ్గుగని ప్రాంత ప్రజల పక్షాన జర్నలిస్టు మునీర్ పోరాటం చేశారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు మాదాసు రామమూర్తి, ఐజేయూ జాతీయ నాయకుడు ఎం వంశీ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 6న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టు మునీర్ సంస్మరణ సభను నిర్వహించనున్నట్టు చెప్పారు. పొలాడి శ్రీనివాసరావు, నరహరి, ఐ కృష్ణ, విశ్వనాథ్, తోకల రమేష్, పులి మోహన్, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, రాజయ్య, కుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా



రైతులకు విత్తనాల బ్యాగులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూన్ 3: (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తూ అధిగ దిగుబడులు సాధించే విత్తనాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాట్నపల్లి రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంబించారు. నియోజకవర్గంలోని ఒక్కో గ్రామం నుంచి ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి విత్తనాల బ్యాగులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రతీ వ్యవసాయ సీజన్‌లో రైతులు విత్తనాల విషయంలో మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. శాస్త్రవేత్తల ద్వారా రూపొందించిన విత్తనాలు అధిక దిగుబడులు ఇవ్వడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడతాయన్నారు. ఆదర్శ రైతుల ద్వారా నాణ్యమైన విత్తనాలతో సాగు చేయిస్తూ భవిష్యత్తులో వీరి ద్వారా విత్తనాలు ఉత్పత్తి చేయించి మిగతా రైతులకు అందిస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, కేడీసీసీబీ డైరక్టర్ మోహన్ రావు, వ్యవసాయాధికారులు పద్మ, రాజు, స్వప్న, ప్రశాంత్, రవితేజ, సౌమ్యతో పాటు మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: నాణ్యమైన విత్తనాలతోనే పంట అధిక దిగుబడి వస్తుందని కరీంనగర్ శాస్త్రవేత్త విజయభాస్కర్ అన్నారు. రైతువేదికలో వరి, పెసర విత్తనాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం విత్తుకొద్దిపంట అనే కార్యక్రమాన్ని చేపట్టిందని కునారం వ్యవసాయ పరిశోధన కేంద్రం ద్వారా ఉత్పత్తి చేసిన విత్తనాలను అందజేశామన్నారు ఏవో నాగార్జున, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏవో నాగార్జున, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సదయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజమల్లు, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా కార్యక్రమాన్ని చేపట్టినట్లు కునారం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ సిద్ధి అన్నారు. రాఘవపూర్ రైతువేదికలో శాస్త్రవేత్త శ్రీధర్ సిద్ధి, మండల వ్యవసాయాధికారి అలివేణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. రైతులకు 10 కిలోల బరువు ఉన్న 46 వరి విత్తన సంచులు, 23 పెసర సంచులను రైతులకు అందజేశారు.

ముత్తారం: రైతులకు నాణ్యమైన విత్తనం అందించడంలో భాగంగా గ్రామంలో విత్తన స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వం కునారం వారి నుంచి 30 వరి, 15 పెసర విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. శాస్త్రవేత్త మధుకర్‌రావు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తంలా ఉంటుందని, విత్తనం మంచిదైతేనే దిగుబడి అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, మండల వ్యవసాయాధికారి అనూష, వ్యవసాయ విస్తరణ అధికారులు మనీషా, శ్రీలేఖ, హరిఖ, రైతులు పాల్గొన్నారు.

ఎలిగేడు: రైతులు నాణ్యమైన విత్తనోత్పత్తిని పెంచుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్రావణి అన్నారు. రైతువేదికలో గ్రామగ్రామన నాణ్యమైన విత్తనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి, పెసర విత్తనాలను రైతులకు అందజేశారు. ఏడీఏ కాంతారావు, ఏవో ఉమాపతి, ఏఈవోలు గణేష్, సురేష్, శరణ్య వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఓదెల: శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో రైతులు నాణ్యమైన విత్తనోత్పత్తి చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త విజయభాస్కర్ తెలిపారు. రైతువేదికలో ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త విజయభాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాణ్యమైన విత్తనాల సరఫరాను వినియోగించుకోవాలని తెలిపారు. 11 రెవెన్యూ గ్రామాలకు 22 వరి విత్తనాలు, 11 పెసర విత్తన కిట్లను పంపిణీ చేశారు. ఏవో భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.



విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్త విజయభాస్కర్

రామగిరి: రత్నాపూర్ రైతు వేదికలో నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం అనే అవగాహన సదస్సును చేపట్టారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా రైతులకు విత్తన పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరీంనగర్ డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ మదన్మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు నవీన్, అరవింద్, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

మంథనిరూరల్: మండలంలోని సూరయ్యపల్లి గ్రామంలో అధికారులు నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు విత్తన సంచులను పంపిణీ చేశారు. 32 రెవెన్యూ గ్రామాలకు చెందిన గ్రామానికి ముగ్గురు రైతుల చొప్పున విత్తనాలు అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడి పెంచుకోవాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డా.శ్రీధర్‌సిద్ది అన్నారు. గుండారం రైతువేదికలో నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. మండల వ్యవసా యాధికారి రామకృష్ణ, ఏఈవోలు అనూష, శ్వేత రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి అందరూ కృషి చేయాలని, సింగల్ యూసెజ్ ప్లాస్టిక్ వాడకం పూర్తి స్థాయిలో నిషేధించాలని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి వివరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ స్టీల్ టిఫిన్ బాక్స్, స్టీల్ బాటిల్, క్లాత్ బ్యాగ్ వినియోగించాలని, ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మురుగునీటి శుద్ధి వంద శాతం జరిగేలా అమృత్ పథకం కింద పలుచోట్ల సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ లను నిర్మిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిర్మాణాల కూల్చివేతల వ్యర్థాల నిర్వహణ ప్రణాళిక బద్ధంగా చేసినట్లయితే అవసరమైన కొత్త పరికరాలను తయారు చేయవచ్చని, ఈ వ్యర్థాల నిర్వహణకు మున్సిపల్ అధికారులను లేదా18001201159 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని, పారిశ్రామిక వ్యర్థాలను నదుల్లోకి, చెరువులోకి వదలకుండా చూడడం మనందరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బిక్షపతి, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వీరేష్, అసిస్టెంట్ సైంటిస్ట్ కనుక జ్యోతి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



నాంసానిపల్లి గ్రామ సభలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు,దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో సురేష్

కాల్వశ్రీరాంపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని తహసీల్దార్ జగదీశ్వర్‌రావు అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తులు భూసమస్యలపై తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆర్డీవో గంగయ్య పరిశీలించి పలు సూచనలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఆర్ఐలు నిహారిక, వజహత్‌అలీ, సీనియర్ అసిస్టెంట్ అజీమ్ పాల్గొన్నారు.

ఓదెల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. నాంసానిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 34 దరఖాస్తులను స్వీకరించగా, శానగొండలో 116 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ ధీరజ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

మంథనిరూరల్: సిరిపురం, పుట్టపాక, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. సిరిపురంలో ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కుమారస్వామి పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పుట్టపాకలో పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడారు. ఎక్లాస్‌పూర్, పుట్టపాక గ్రామాల్లో డీటీ గిరి, రాంబాబులు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆర్ఐలు సదయ్య, అనీల్‌లు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో సురేష్ అన్నారు. లింగాల రెవెన్యూ సదస్సును సందర్శించి పలువురు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి సమస్య పరిష్కరిస్తారని, పైరవీకారుల చుట్టు తిరిగి సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. తహసీల్దార్ వాసంతి, సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు, పాల్గొన్నారు.

సుల్తానాబాద్: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బషీరొద్దీన్ రైతులకు సూచించారు. సుద్దాల, గొల్లపల్లి గ్రామాలలో సదస్సులను ప్రారంభించారు. గొల్లపల్లిలో నలభై, సుద్దాలలో పదిహేడు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. మాజీ సర్పంచ్ బండారి రమేష్, డిప్యూటీ తహసిల్దార్ రాకేష్, ఆర్ఐలు పాల్గొన్నారు.

జూలపల్లి: రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ జక్కని స్వర్ణ అన్నారు. తెలుకుంటలో 68, కాచాపూర్‌లో 97 దరఖాస్తులను రైతులు అందజేసారు.

ఆలయ భూములను కాపాడాలి

ఎలిగేడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముప్పిరితోట వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను కబ్జాదారుల చెరలో నుంచి విడిపించాలని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ యాకన్నకు ఫిర్యాదు చేశారు. ఆలయానికి 400ఏళ్ల చరిత్ర ఉందని గ్రామస్తులు తెలిపారు. ఆలయ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఆలయం చుట్టూ ఉన్న భూములను వివిధ కులాలవారు ఆలయానికి విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు. గ్రామంలో ఒక కుటుంబానికి చెందిన పూర్వీకులు ఆలయాన్ని నిర్మించడం వల్ల నిర్వహణ, జాతరలను జరిపిస్తూ భూములను ఆ కుటుంబం ఆధీనంలోనే పెట్టుకున్నారని ఆరోపించారు. గ్రామంలో సర్వేనంబర్ 409లో 3.30ఎకరాలు, సర్వేనంబర్ 417లో 1.27 ఎక రాలను కబ్జా చేసుకొని పంటలను సాగు చేస్తున్నార న్నారు. ప్రస్తుతం ఆభూములను అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జాల నుంచి భూములను కాపాడి ఆలయానికి అప్పగించాలని గతనెల 20న జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశామని తెలిపారు. భూములపై వెంటనే విచారణ చేసి ఆలయానికి అందించాలని గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ యాకన్న, ఆర్ఐ జయలక్ష్మి, జూలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గ్రామానికి వెళ్లారు. గ్రామస్థులు ఆలయ భూములకు సంబంధించిన వివరాలను వివరించారు.

వైద్య విద్యార్థులు ఫిజికల్ ఫిట్‌నెస్‌ను అలవర్చుకోవాలి



జిమ్ ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు చదువుతోపాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌ను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం సింగరేణి మెడికల్ కళాశాలలో రూ.15 లక్షలతో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రారంభించారు. మెడికల్ కళాశాలకు ఖని జనరల్ ఆస్పత్రి అనుసాధనంగా వైద్య విద్యార్థులకు రాజీవ్ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, ఆర్ఎంఓలు రాజు, రేణుక, వైస్‌ప్రిన్సిపాల్ నరేందర్ బాబు, నాయకులు మహంకాళి స్వామి, ఎండి ముస్తాఫా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్‌తో కలిసి గౌడ కులస్తులకు కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వృత్తిదారులకు రక్షణ కవచాలను పంపిణీ చేస్తుందని, వెనుకబడిన కులాల సంక్షేమానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఎక్సైజ్ సీఐ మంగ, నాయకులు మహంకాళి స్వామి, ముస్తాఫా, రాజేష్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత లోపంపై ఎమ్మెల్యే సీరియస్

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): విఠల్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో సింగరేణి కాలనీల్లో వేస్తున్న అంతర్గత రహదారుల్లో నాణ్యత లోపాలపై ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సీరియస్ అయ్యారు. కాలనీవాసులు రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వేసిన రోడ్డును తవ్వించిన ఎమ్మెల్యే వీడియోకాల్‌లో సింగరేణి అధికారులకు చూపించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన సింగరేణి యాజ మాన్యం లోపాలను సరిదిద్దుతామని, నాణ్యతతో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటా మన్నారు.

గ్రంథాలయం అభివృద్ధికి చర్యలు

కోల్‌సిటీ టౌన్ (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్‌తో కలిసి పవర్ హౌజ్ కాలనీలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయ అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించామని, గ్రంథాలయంలో చదివి పోటీ పరీక్షల్లో అనేకమంది ఉద్యోగాలు సాధించారన్నారు. చైర్మన్ అన్నయ్యగౌడ్ మాట్లాడుతూ హాల్‌ను విస్తరించడంతో పాటు గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కళ్యాణ్‌నగర్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణ కేంద్రం ద్వారా శిక్షణ పొంది మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని రాణీరుద్రమ దేవి కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకులు కటుకు ప్రవీణ్ అన్నారు. మంగళవారం కుట్టు శిక్షణ ముగింపు సందర్భంగా మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు అభివృద్ధికోసం వారు సొంతంగా వారి కాళ్లపై నిలబడడం కోసం ఈ కుట్టు శిక్షణ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నసీమా బేగం, రేష్మ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థి ప్రతిభ



కోల్‌సిటీటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఖని కృష్ణవేణి వికాస్ కాలేజీ విద్యార్థి మోక్షిత్ ప్రతిభ కనబర్చాడు. సోమవారం విడుదలైన జేఈఈ ఫలితాల్లో రాచపల్లి మోక్షిత్ ఆల్ ఇండియా 2835 ర్యాంక్ సాధించాడు. మంగళవారం కాలేజీలో ప్రిన్సిపాల్ వెంకన్న మోక్షిత్‌ను సన్మానించారు. జేఈఈ ఫలితాల్లో ర్యాంక్ సాధించిన మోహిత్‌ను కాలేజీ సిబ్బంది అభినందించారు.

నూతన గనుల సాధనకు ముమ్మర ప్రయత్నాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం నాయక్

గోదావరిఖని, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలోని 12ఏరియాల ప్రస్తుత గనుల పరిస్థితి, భవిష్యత్‌లో చేపట్టే గనుల సాధనకు అవలంబించాల్సిన కార్యాచరణపై సీఎండీ ఎన్ బలరామ్ ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం ఏరియా జీఎంలతో సమీక్ష నిర్వహించి భవిష్యత్‌పై దిశా నిర్దేశం చేశారు. కంపెనీ విస్తరణపై అలాగే కంపెనీ ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారంలో ఏరియా జీఎంలు పోషించాల్సిన పాత్రను వివరించారు. ఈ సందర్భంగా ఉత్పత్తి సాధనలో కీలకమైన ఓవర్ బర్డెన్ తొలగింపులోనూ ఎదురయ్యే సమస్యలను తొలగించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లతోనూ అప్పటికప్పుడే మాట్లాడి వారి ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేశారు. ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తితో పాటు రవాణాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బొగ్గు నాణ్యత, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని స్పష్టం చేశారు. అలాగే నూతన గనులు లేకపోతే ఇల్లందు, మణుగూరు, బెల్లంపల్లి తదితర ఏరియాల భవిష్యత్ ఉండదని, నూతన గనుల కోసం ప్రయత్నాలు సాగించాలన్నారు. ముఖ్యంగా అటవీ అనుమతుల సాధనలో ఎలాంటి జాప్యం జరగకూడదన్నారు. ఉద్యోగులు యంత్రాలతో షిఫ్టులో పూర్తి పనిగంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండే వారిని అవసరమైతే తొలగించాలని ఆయన ఆదేశించారు. గైర్హాజరు శాతాన్ని గణనీయంగా తగ్గించాలని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎండీ సూచించారు. కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో డైరెక్టర్ ఈఅండ్‌ఎం డీసత్యనారాయణరావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ పర్సనల్ కే వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ యస్‌డి ఎం సుభాని, జనరల్ మేనేజర్ సీపీపీ ఏ మనోహర్, ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

సులభ్ కార్మికులకు హక్కులు కల్పించాలి

గోదావరిఖని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సులభ్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులను కల్పించడంలో సింగరేణి యాజమాన్యం విఫలమైందని, సులభ్ కార్మికులు అందులోనే నివాసముంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సులభ్ కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వడం లేదని, కార్మికులను చిన్నచూపు చూస్తుందని, కనీసం సింగరేణి ఆసుపత్రిలో అవుట్‌పేషెంట్ వైద్యం అందించడం లేదని, పీఎఫ్ సౌకర్యం కల్పించడం లేదని, పలుమార్లు సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేసినా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 5న సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చలో కొత్తగూడెం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నరేష్, రాజేశం, సంతోష్, సారయ్య, సాంబయ్య, తిరుపతి పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలపై పోరాటం చేసేది టీయూసీఐ

గోదావరిఖని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో కార్మికుల సమస్యలపై ఉద్యమించేది టీయూసీఐయేనని ఆ సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు తోకల రమేష్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు, ధర్నాలు చేసి కార్మిక రంగానికి అండగా నిలబడింది టీయూసీఐ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 29చట్టాలుగా సవరించి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ రానున్న రోజుల్లో 12గంటల పని విధానాన్ని అమలు చేయడానికి కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. ఈ నెల 8న ప్రెస్‌క్లబ్‌లో జరిగే టీయూసీఐ ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గుజ్జుల సత్యనారాయణ, శంకర్, చంద్రయ్య, వైకుంఠం, రాయమల్లు, పాల్గొన్నారు.

బీఎంఎస్ ఆర్జీ-2 సెక్రెటరీగా శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ ఆర్జీ-2 ఏరియా కార్యదర్శిగా గట్టు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు యూనియన్ జనరల్ సెక్రెటరీ సారంగపాణి నియామకపత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. ఏరియాలో బీఎంఎస్ బలోపేతానికి కృషి చేయాలని, కార్మికులకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా పని చేయాలని సూచించారు.